
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.6 । కనిష్ఠం 20.4



కామారెడ్డి

జిల్లా వార్తలు

3

శుక్రవారం 6 డిసెంబరు 2024

రైతులు వరి కొయ్యలను కాల్చొద్దు

రాజంపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో కామారెడ్డి డివిజన్ వ్యవసాయ సంచలకులు, మండల ప్రత్యేకాధికారి అపర్ణ గురువారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు వరి కొయ్యలను కాల్చవద్దని తెలిపారు. భూమి సారం తగ్గి వాయుకాలుష్యం కూడా జరుగుతుందని, పచ్చిరొట్ట ఎరువుల సాగు, సేంద్రియ ఎరువుల వాడకం వల్ల కొంత వరకు నేలసారాన్ని కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శిల్ప, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం

తుది దశకు..

ధాన్యం కొనుగోళ్లు!

- జిల్లాలో ఇప్పటి వరకు 4.18 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- మరో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం
- ఇప్పటికే 231 కొనుగోలు కేంద్రాల మూసివేత
- రూ.970 కోట్ల విలువ చేసే ధాన్యం కొనుగోళ్లు
- ఇందులో 88 శాతం మంది రైతులకు రూ.856 కోట్లు ఖాతాలో జమ
- 13 వేల మంది రైతుల నుంచి 88,047 మెట్రిక్ టన్నుల సన్నాల కొనుగోలు
- సన్నరైతులకు రూ.44.02కోట్ల బోనస్ చెల్లింపు

కామారెడ్డి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో ఆలస్యంగానైన ధాన్యం కొనుగోళ్లు ప్రభుత్వం చేపట్టినా ప్రశాంతంగా కొనసాగుతూ వచ్చింది. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇవ్వనున్నందున ఈ సీజన్‌లో ఆలస్యంగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇలా సుమారు నెల రోజుల పాటు రైతుల నుంచి ధాన్యం సేకరణ చేపట్టారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు దాదాపు తుది దశకు చేరుకుందని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఈ సీజన్‌లో సన్న రకం వరికి మంచి డిమాండ్ ఉండడంతో ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ ధరకే కొనుగోలు చేస్తుండడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ రైతులు కేంద్రాల్లోనే విక్రయించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 81,530 మంది రైతుల నుంచి 4.18లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మరో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలోని వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు 424 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సీజన్‌లో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత నెల రోజుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపడుతూ వస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 81,530మంది రైతుల నుంచి 4,18,394 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్న రకం వరి ధాన్యానికి రూ.500లు బోనస్ ఈ సీజన్ నుంచి అమలు చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సన్నాలు, దొడ్డు రకం వరి ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించారు. ధాన్యం కొనుగోలు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ఇప్పటికే 231 కొనుగోలు కేంద్రాలను మూసి వేశారు.

నియోజకవర్గాల వారీగా కొనుగోళ్లు ఇలా..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తికావస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 424 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం సేకరించారు. చిన్న చిన్న సమస్యలు ఒడిదుడుకుల మధ్య కొనుగోళ్లు కొనసాగాయి. జిల్లాలో నియోజకవర్గాల వారీగా ధాన్యం కొనుగోళ్లు ఇలా ఉన్నాయి. కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో 1,03,841 మెట్రిక్ టన్నులు, ఎల్లారెడ్డిలో 1,66,594 మెట్రిక్ టన్నులు, బాన్సువాడలో 50,445 మెట్రిక్ టన్నులు, జుక్కల్‌లో 1,10,483 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

రూ.970 కోట్ల విలువ చేసే ధాన్యం సేకరణ

జిల్లా వ్యాప్తంగా 81,530 మంది రైతుల నుంచి 4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేపట్టారు. వీటి విలువ రూ.970 కోట్లు ఇందులో ఇప్పటి వరకు 3.97లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి వివరాలను ట్యాబ్ ఎంట్రి పూర్తి చేశారు. 3.82 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన ట్రక్ షీట్లను జనరేట్ చేశారు. 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు తరలించారు. ఇప్పటి వరకు 3.68లక్షల మెట్రిక్ టన్నులకు సంబంధించి 88 శాతం మంది రైతుల ఖాతాలో రూ.856 కోట్ల ధాన్యం డబ్బులను జమచేశారు. ఇంకా 12శాతం ధాన్యం డబ్బులు రైతులకు రావాల్సి ఉంది.

రూ.44.02కోట్ల బోనస్ డబ్బులు చెల్లింపు

రాష్ట్ర ప్రభుత్వం ఈ వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో సన్న రకం వరికి క్వింటాల్‌కు రూ.500ల బోనస్ అమలు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో సన్న రకం, దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లను వేర్వేరుగా చేపట్టారు. సన్నరకం ధాన్యం కొనుగోలు చేసేందుకు సుమారు 60కి పైగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 13,506 మంది రైతుల నుంచి రూ.204కోట్ల విలువ చేసే 88,047 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 13,506 మంది రైతులకు సన్నరకం వరికి బోనస్ కింద రూ.44.02కోట్ల డబ్బులను ప్రభుత్వం అదనంగా చెల్లించింది.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తున్న ఎమ్మెల్యే

- ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను అమలు చేయని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి
- అభివృద్ధి జరుగుతుంటే సహించలేక ప్రొటోకాల్ జగడం మొదలుపెట్టావు
- డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజల నమ్మకాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వమ్ము చేస్తున్నారని, ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను ఏ ఒక్కటి కూడా అమలు చేయడం లేదని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ఆరోపించారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాద బృందాన్ని ఏర్పాటు చేసి కబ్జాలకు గురైన భూములను ఇప్పిస్తానని ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే ఎంత మందికి న్యాయం చేశాడన్నారు. దమ్ముంటే ముందు డిగ్రీ కళాశాల భూముల్లో జరిగిన కబ్జాల గురించి మాట్లాడాలని అన్నారు. గ్రామగ్రామాన వాడవాడల్లో ఫిర్యాదుల పెట్టెను పెట్టావని ఎంత మంది ఫిర్యాదు చేశారని అందులో ఎంత మందికి న్యాయం చేశావని ప్రశ్నించారు. అభివృద్ధి జరుగుతుంటే ప్రొటోకాల్ జగడం మొదలు పెట్టాడని మళ్లీ ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం సహకరించడం లేదనే అబద్ధపు మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. పార్టీ మారే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్ఠానానికి సంప్రదింపులు చేసిన మాట వాస్తవం కాదా, నీముఖ్య అనుచరులతో రహస్య సమావేశం నిర్వహించలేదా అని అన్నారు. మాటలతో కాదు నిధులతో అభివృద్ధి జరపాలని అన్నారు. తాగు నీటి కోసం అమృత్ నిధులు నీవు తీసుకువచ్చినవి కావని గత ప్రభుత్వ హయాంలో మంజూరు అయి పెండింగ్‌లో ఉంటే ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అధికారులను సమన్వయం చేసుకుని లోటుపాట్లను సరిదిద్దుకుంటూ రాష్ట్ర వాటా మున్సిపల్ వాటా నిధులు విడుదల చేయించి తాగునీటి సమస్య తీర్చాలని పట్టుదలతో పనులు పూర్తి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ఎఫ్ చెక్కులను ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు విడుదల చేయిస్తే చెక్కులను నేనే పంపిణీ చేస్తానని ముఖ్యమంత్రి కార్యాలయంలో ధర్నా చేసి చెక్కులు పంపిణీ చేశాడని అన్నారు. అకాల వర్షాలకు కామారెడ్డి పట్టణం అతలాకుతలమైతే కనీసం వారిని పలకరించిన పాపానపోలేదని, భిక్కనూరు రామేశ్వర్‌పల్లిలో డబుల్‌బెడ్ రూంలు నీట మునిగి ప్రజలు నిరాశ్రయులైతే వారిని హుటాహుటిన ఆశ్రయం కల్పించి వారిని ఆర్థికంగా కూడా షబ్బీర్‌అలీ ఆదుకున్నాడని అన్నారు. సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు కల్లాలు, మోడల్ స్కూల్, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, స్టేడియాలు, ఉపాధి శిక్షణ కేంద్రం, రైతుసేవ కేంద్రాలు తదితర వాటిని ఎక్కడ అమలుపరిచాడో ఎమ్మెల్యే చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు రాజు, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, సందీప్, ప్రసాద్, రాజాగౌడ్, గంగాధర్, శ్యామ్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి

పుస్తకాల విరాళం



విరాళం అందించిన గోపికృష్ణను సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో పుస్తకాల కొనుగోలుకు రూ.1లక్ష 26వేలను ఆకుల గోపి అనే వ్యక్తి అందించినట్లు గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. విద్యను అందరికి అందించాలనే నిబద్ధతతో, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం పుస్తకాలు అందుబాటులోకి తెచ్చేందుకు విరాళం అందించడం అభినందించదగిన విషయమని అన్నారు. అనంతరం గోపికృష్ణ మాట్లాడుతూ మన సమాజ అభివృద్ధికి విద్యే పునాది పుస్తకాలు చదివే అలవాటు అభ్యుదయానికి దారి చూపుతుందని ప్రతీ విద్యార్థి గుండెల్లో విజ్ఞాన దీపం వెలిగించడమే మా లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో మాట్లాడుతున్న డీఈవో రాజు

జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను

విజయవంతం చేయండి : డీఈవో

బాన్సువాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని డీఈవో రాజు, డీఎస్‌వో సిద్ధిరాములు అన్నారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 6, 7వ తేదీల్లో నిర్వహించనున్న ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సుమారు 400 ప్రదర్శనల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి మొత్తం రెండు వేల వరకు ఈ ప్రదర్శనలో పాల్గొంటారని వారు తెలిపారు. ప్రదర్శనకు సంబంధించి అన్ని ఏర్పాటు పూర్తయ్యాయని చెప్పా=రు. అలాగే రెండు రోజులపాటు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భోజన వసతి రాత్రి బస చేసేందుకు గదులను ఏర్పాటు ఈ కార్యక్రమానికి ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్‌తో పాటు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీలు, కామారెడ్డి జిల్లాలోని ఎమ్మెల్యేలు అందరూ పాల్గొంటారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఎంఈవో నాగేశ్వరరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుశాల్, తపస్ జిల్లా కార్యదర్శి సంతోష్ లక్క నరహరి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా రుణాలను మంజూరు చేయాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు లక్ష్యానికి అనుగుణంగా మంజూరు చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రెండో త్రైమాసిక బ్యాంకర్ల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక, ఎంఎస్‌ఎంఈ, విద్యా రుణాలు, గృహ రుణాలు, స్వయం సహాయక బృందాలకు రుణాలు ఇతర ప్రాధాన్యత పథకాలకు సంబంధించిన వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో త్రైమాసికంలో సాధించిన ప్రగతి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సాధించాల్సిన ప్రగతిపై చర్చించారు. వార్షిక క్రెడిట్ ప్లాన్ 4,695 కోట్లు కాగా సెప్టెంబరు మాసంతం వరకు 2030కోట్ల రుణం మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నాబార్డ్ డీఎం ప్రవీణ్, ఆర్‌బీఐ ఏజీఎం రహమాన్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికాంత్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

సర్వే డేటా ఎంట్రీలో తప్పులు సరి చేయాలి

సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో వార్డు నెంబర్లను సరి చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, ఆర్‌డీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో వార్డు నెంబర్లను తప్పుగా నమోదు చేయడం జరిగినట్లు గుర్తించడం జరిగిందని, ఓటరు జాబితా ప్రకారం ఇంటి నెంబర్‌ల ప్రకారం వార్డు నెంబర్ వేయడం సరి చేసుకుని, సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాగానే సరి చేయాలని తెలిపారు. గ్రాడ్యుయేట్, టీచర్ల నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి ప్రాసెస్ చేయాలని తహసీల్దార్లు, ఈఆర్‌వోలను కలెక్టర్ ఆదేశించారు. ఎస్‌ఎస్‌ఆర్ కింద ఫారం 6,7,8లు లాగిన్‌లో ఉన్న వాటిని తహసీల్దార్‌లు, ఆర్‌డీవోలు ఆయా ఫారాలను ప్రాసెస్ చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డీవో రంగనాథ్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, సీపీవో రాజారాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలం అయిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార విమర్శించారు, గురువారం జుక్కల్ మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ వ్యవసాయ రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికీ పూర్తిగా రైతులకు 2 లక్షల రుణమాఫీ కాలేదని విమర్శించారు. ఖరీఫ్ పంటకు రైతు భరోసా ఇవ్వని ప్రభుత్వం రబీ పంటకు కూడా రైతు భరోసా ఇవ్వడం లేదని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్ పాలన 6 గ్యారెంటీలు 66 మోసాలుగా మారిందని ఆక్షేపించారు. పింఛన్ల పెంపుదల ఏమైందని, గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైన ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. అంతకు ముందు జుక్కల్ మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాలకుంట్ల రాము, నాయకులు పాల్గొన్నారు.



కామారెడ్డి రైల్వేస్టేషన్‌కు

ఆధునిక హంగులు

- యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్న పనులు
- అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద మెరుగులు
- 39.84 కోట్ల వ్యయంతో పునర్ నిర్మాణం



7

మద్నూర్‌లో ప్రపంచ భూసార పరీక్షా దినము

మద్నూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం రైతు వేదికలో ప్రపంచ భూసార పరీక్షా దినము పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి రాజు మాట్లాడుతూ భూమి ఆరోగ్యం, మట్టిలో సూక్ష్మజీవుల ప్రాముఖ్యత, సేంద్రీయ ఎరువుల వినియోగం, పచ్చిరొట్ట పంటల ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు.



ఎమ్మెల్సీ కవితను కలిసిన మండల బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవీపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం పలువురు మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ మేరకు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత స్వగృహానికి నాయకులు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థులు అత్యధిక సీట్లు గెలుచుకోవాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, మండల బీఆర్ఎస్ నాయకులు, సొసైటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.20.82 కోట్ల జమ

నవీపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోల సొసైటీ పరిధిలో వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం విక్రయించిన రైతులకు ఇప్పటి వరకు 20.82కోట్ల రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు అన్నారు. గురువారం సొసైటీలో జరిగిన డైరెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం విక్రయాలకు సంబంధించి 1300మంది రైతుల ఖాతాలలో ఈ డబ్బులను జమ చేయడం జరిగిందని అన్నారు. వివిధ కారణాలతో రుణమాఫీ వర్తించని రైతులకు వెంటనే రుణమాఫీ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాబర్, సొసైటీ కార్యదర్శి రమేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

ఎడపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామి పనుల నిర్వహణపై అధికారులు ఆడిట్ నిర్వ హించారు. ఎడపల్లి మండలంలోని పనులు నిర్వహించిన గ్రామాలలో ఆడిట్ నిర్వహించి గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టరు సాయాగౌడ్ ఆధ్వర్యంలో ప్రజా వేదిక నిర్వహించారు. ఈ వేదికలో ఒక్కో గ్రామంలో జరిగిన పనులను ఆడిట్ అధికారులు చదివి వినిపించారు. పలు గ్రామాల్లో పనిచేసిన కూలీలకు డబ్బులు ఇంకా రాలేవని, కొన్ని మస్టర్‌లపై అధికారులు సంతకాలు చేయలేదని, హరితహారం, అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన చెట్లు అక్కడక్కడా కొన్ని చనిపోయాయని, కొందరు జాబ్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, కొన్ని చోట్ల పనిచేసిన కాలువలు రైతులు పూడ్చి వేశారని సామాజిక తనిఖీలో తేలిందన్నారు, వీటిని సరి చేయాలని పిడీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడిఓ శంకర్, ఏపీఓ శ్రీవాణీ, ఆడిట్ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, ఉపాధిహామీ కూలీలు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమ్మర్‌పల్లి పోలీసులు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరిగి పోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమ్మర్‌పల్లి ఎస్సై అనీల్ రెడ్డి అధ్వర్యంలో పోలీసులు గురువారం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. వాట్సాప్‌లు, ఫేస్‌బుక్కుల్లో వివిధ పద్ధతుల్లో నేరగాలు లింక్‌లు పంపుతుంటారని వాటిని ఓపేన్ చేస్తే మనకు సంబంధించిన బ్యాంక్ అకౌట్‌ల డాటను అడుగుతారని అవి చేబితే మీరు మోసపోతారని అలాటి పొరపాట్లు చేయవద్దని సూచించారు. వీటిపట్ల ప్రజలు ముఖ్యంగా యవత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవగాహన కార్యక్రమంలో ఏఎస్సై నరేందర్, కానిస్టేబుల్ బద్రిపోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల పరీక్ష కేంద్రంలో అన్ని వసతులు కలిగి ఉండాలి

ముప్కాల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): రాబోయే పదవ తరగతి పరీక్షలకు నిర్వహించే పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జమినేషన్ విజయబాస్కర్ అన్నారు. గురువారం బాల్కొండ మండలంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. అన్ని పరీక్ష కేంద్రాలలో మౌలిక సదుపాయాల గురించి ఆదేశించారు. పునర్వ్యవస్థీకరణ విషయంలో సమగ్ర నివేదికను సమర్పించాలని మండల విద్యాధికారిణి ఆదేశించారు. అలాగే ప్లానింగ్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ఓ ప్రైవేటు పాఠశాలను సందర్శించి పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఉచిత దుస్తుల అక్విటెన్స్‌ని పరిశీలించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న సమగ్ర శిక్ష విద్యార్థుల యొక్క అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో బట్టు రాజేశ్వర్, ఉపాధ్యాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా విజయోత్సవాలు చేయడం సిగ్గుచేటు

ఎల్లారెడ్డి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభ ఎన్నికల ముందు ప్రజలకు మోసపూరిత అరు హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చకుండా. విజయోత్సవ వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటని ఎల్లారెడ్డి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి అన్నారు గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల గారడీ ఆరు అబద్ధాలు, 66 మోసాలు అని ఇచ్చిన హామీలను ఏ ఒక్క గ్యారెంటీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదని ఇప్పటివరకు ఇందిరమ్మ ఇల్లు అందించలేదని రైతులకు చేయూత ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రైతుల పక్షానా పోరాటానికి సిద్ధమని. రాష్ట్రంలో మారింది పాలకులే కానీ పాలన కాదు అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పైల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింలు, బత్తిని దేవేందర్, మాజీ ఎంపీపీ నక్క గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు



చేపూర్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ముప్కాల్‌లో..

ఆర్మూర్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్, హరిపూర్ గ్రామాల్లో గురువారం ప్రజాపాలన విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టు విక్రమార్క, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ ఇందూర్ సాయన్న, మాజీ ఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, దాసరి శ్రీకాంత్, రాంసాన్, శ్రీనివాస్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం ముప్కాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల కాంగ్రెస్ మగ్గిడి ముత్యంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందరవి, ముస్కు మోహన్, కొమ్ముల శ్రీనివాస్, సాగర్, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ముత్యాల రాములు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గిర్మాజీ గోపి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాల అశోక్, పీడీ గంగారాం, జక్కం అశోక్, హర్షద్ పాల్గొన్నారు.

వేల్పూర్: వాడి, సాహెబ్‌పేట్ గ్రామాల్లో ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్, నవీన్, రమేష్, మహేందర్, సతీష్, అశోక్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మహిళా సంఘాల సంక్షేమమే ధ్యేంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తున్నదని బాల్కొండ నియోజకవర్గ కోఆర్డినేటర్ శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కమ్మర్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ఏడాది వియోత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, అబ్దుల్ రఫీ, పడిగెల ప్రవీణ్, తక్కూరి దేవేందర్, శ్రీరాముల మురళి పాల్గొన్నారు.

భీమ్‌గల్‌రూరల్: ప్రజాపాలన విజయోత్సవ సంబరాలలో భాగంగా గురువారం మండలంలోని మెండోర గ్రామంలో సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు.



మోర్తాడ్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కమ్మర్‌పల్లిలో..

పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని, ప్రతి కార్యకర్తను తన గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నివాసంలో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని నూతనంగా ఎన్నికైన నాయకులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు కార్తీక్ యాదవ్, రెంజల్ మండల అధ్యక్షులు గైని కిరణ్, బోధన్ మండల అధ్యక్షులు యగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

అంతర్జాతీయ నేల ఆరోగ్య దినోత్సవం

కోటగిరి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎత్తొండ రైతు వేదికలో గురువారం అంతర్జాతీయ నేల ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈవో సందీప్ మాట్లాడుతూ నేల ప్రాముఖ్యత, నేలను ఎలా కాపాడుకోవాలి. మట్టి పరీక్షలు ఎలా నిర్వహించాలనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు సయ్యద్, తయ్యబ్, గంగాధర్, భాస్కర్, ఫణీ, కిష్టయ్య, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై విక్రయాలతో ఇబ్బందులు

బోధన్‌రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని వీక్లి మార్కెట్ ప్రధాన రహదారిపై పలు రకాల వ్యాపారస్తులు కూరగాయలు, మాంసం విక్రయాలు చేస్తుండడంతో రహదారి ఇరుకుగా మారి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సోషల్ వర్కర్ నాగళ్ల హన్మంత్ రావు గురువారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులకు కేటాయించిన సముదాయాలలో వ్యాపారాలు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట రాధాకృష్ణన్, స్థానికులు తదితరులున్నారు.

మోర్తాడ్‌లో పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

మోర్తాడ్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలను, ఎంపీపీఎస్ పాఠ శాలలను మండల విద్యాధికారి సమ్మిరెడ్డి తనిఖీలు చేశారు. గురువారం మండలంలోని ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఎఫ్ఎల్ఎన్ పనితీరు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎండీఎఫ్ పైనా తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు ప్రభాకర్, ప్రగతి, మొహినోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులమని అధైర్యపడొద్దు

జక్రాన్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులమని అధైర్యపడొద్దని, ధైర్యంగా అన్ని రంగాల్లో ముందుకు వెళ్తూ రాణించాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. గురువారం జక్రాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు వివిధ ఆటల పోటీ లను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు బిస్కెట్‌లు, పెన్నులు, నోట్‌బుక్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లింగన్న, మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రదానం

కోటగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన సంఘ సంస్కర్త మండవ ఆదినారాయణ వృద్ధులకు వస్త్ర దానం చేశారు. తన తల్లిదండ్రులు వరమ్మ, అంజయ్య, భార్య రమాదేవిల జ్ఞాపకార్థం వస్త్రదానంతో పాటు అన్నదానం, విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ రెడ్డి, హరిత అనే దంపతులు పాఠశాలలోని ఐదుగురు పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఒకరికి 10వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రావు, రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేలు తదితరులు పాల్గొన్నారు.

సానిటేషన్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 23, 6వార్డులలో గురువారం సానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ప్రతీ వార్డుల్లో సానిటేషన్ పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తడి, పొడి చెత్తను మున్సిపల్ ట్రాక్టర్‌లకు అందజేయాలని ప్రజలను కోరారు. ఆయన వెంట సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఆంక్షలు లేకుండా జీవన భృతి ఇవ్వాలి

కోటగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీడీ పరిశ్రమలో పని చేసే బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవన భృతి ఇవ్వాలని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.మల్లేష్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవన భృతి ఇచ్చే సమయంలో 28-02-2014కటాఫ్ డేట్‌ను ఇవ్వడంతో కార్మికులకు జీవన భృతి అందకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా బీడీ కార్మికులకు జీవన భృతి అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు కళావతి, లక్ష్మి, అనిత, గంగామణి, వనిత, జమున పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి ట్యాంకుల పరిశీలన

మోస్రా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మోస్రా మండల కేంద్రంలోని గల నీటి ట్యాంకులను మిషన్ భగీరథ జిల్లా అధికారి ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారి అశ్విని పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడి నీళ్లు వస్తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నీటి ట్యాంకులు ఎప్పుడు శుభ్రంగా ఉంచాలని జనాలు తాగునీరుకు ఉపయోగకరంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా గ్రామ ప్రజలు ఈ నీరు తాగువచ్చు ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ పాల్గొన్నారు.

పిల్లల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు

ఏర్గట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆనంద్‌రావు మాట్లాడుతూ వికలాంగులు అందరితో సమాన మేనని, వారు విద్యాపరంగా, సామాజికంగా, ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి, ఎంపీవో శివచరణ్, కార్యదర్శి జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

మెండోర, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆర్థికసాయం ప్రకటించిన విషయం తెలిసిందే. గురువారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులు గొల్ల మహేందర్, గొల్ల దేవామల్లు, సుదుల ముత్తెష్, గుండెటి శ్రీనివాస్, తక్కల సాయన్న బాధితులు ఒక్కో కుటుంబానికి రూ.10వేల అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొప్పెల మోహన్, మౌలాన, గంగాధర్, దేవరాజ్, మహేష్, భూమేష్, రాములు, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

జన్నేపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

నవీపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లిలో బుధవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన యారం రమణ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తిరుపతికి వెళ్లాడు. అదేరోజు రాత్రి గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలో ఉన్న లక్ష రూపాయల నగదు, ల్యాప్‌టాప్, కొంత వెండి సామాన్లను ఎత్తుకెళ్లారు. గురువారం చోరీ జరిగిన ఇంటిని ఎస్సై వినయ్ పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదు రాలేదని ఎస్సై వినయ్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

బోధన్‌రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామ శివారులో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు రైతుల పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి ఆయిల్, కాపర్ కాయిల్స్‌లను చోరీ చేయడం జరిగిందని బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ జాదవ్ మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. గ్రామాల్లోని సీసీ ఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారించి త్వరలోనే దొంగలను పట్టుకుంటామని హామీ ఇచ్చామన్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

కోటగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలో ఓ చోరీ కేసులో అశోక్ అనే నిందితుడికి సంవత్సరం జైలుశిక్ష విధించడంతో పాటు వెయ్యి రూపాయల జరిమాన విధించారని రుద్రూరు ఎస్సై సాయన్న తెలిపారు. వివరాల ప్రకారం రుద్రూరు గ్రామానికి చెందిన శశికళ ఇంట్లో 19-11-2017న మూడు తులాల బంగారం, 10తులాల వెండి ఆభరణాలు, వెయ్యి రూపాయల నగదు చోరీ అయింది. ఈ కేసులో బోధన్ పట్టణానికి చెందిన అశోక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద ఉన్న వస్తువులను రికవరీ చేశామని ఎస్సై తెలిపారు. ఈ కేసులో చార్జ్‌షీట్ వేయగా బోదన్ కోర్టులో అడిషనల్ జడ్జి సాయిశివ నిందితుడికి సంవత్సరం జైలుశిక్షతో వెయ్యి రూపాయల జరిమాన విధించారని ఎస్ఐ తెలిపారు. కేసులో బాధితురాలి తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాణి వాదనలు వినిపించినట్లు సాయన్న తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రెంజల్,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలా పేపర్‌మిల్ మీదుగా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్ యాజమానితో పాటు డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు. మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మొరం టిప్పర్లు, జేసీబీల పట్టివేత

కోటగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తొండ క్యాంప్‌లో బుధవారం రాత్రి అక్రమంగా మొరం తవ్వుతున్న రెండు జేసీబీ, రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. అనుమతి లేకుండా మొరం తవ్వకాలు జరిపితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోక్సో కేసులో నిందితుడికి రూం ఇచ్చిన లాడ్జి మేనేజర్ అరెస్టు

జక్రాన్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన అజయ్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో నమ్మించి జక్రాన్‌పల్లి మండలానికి చెందిన బాలికను నిర్మల్‌లోని బస్టాండ్ వద్ద వెంకటసాయి లాడ్జికి తీసుకువెళ్లగా ఆ లాడ్జి మేనేజర్ పెద్దపల్లి సత్యనారాయణ డబ్బులకు ఆశపడి మైనర్ అమ్మాయిని వద్ద కమిషన్‌గా ఎక్కువగా డబ్బులు తీసుకొని ఓనర్‌కు తెలియకుండా లాడ్జి రూం ఇచ్చాడని నిందితుడు అజయ్ మైనర్ బాలికను బలవంతం చేయడంతో అక్టోబర్ 30న బాధితురాలి ఫిర్యాదు మేరకు జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమో దు చేసినట్టు డిచ్‌పల్లి సీఐ కె.మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. నిందితుడు అజయ్‌ను విచారించి అక్టోబర్ 31న నిందితుడిని పట్టుకొని జైలుకు పంపగా నిందితుడు అజయ్ స్టేట్‌మెంట్, ఇతర ఆధా రాలబట్టి సీఐ మల్లేష్ నిందితుడు అజయ్ వద్ద కమీషన్ ఎక్కువ తీసు కొని రూం ఇచ్చినందుకు వెంకటసాయి మేనేజర్ సత్యనారాయణను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మైనర్ బాలికలను లాడ్జికి తీసుకువచ్చే యువకులు ఇతర వ్యక్తులకు ఏలాంటి వివరాలు తెలుసు కోకుండా లాడ్జిలో రూంలు ఇవ్వరాదని, ఎవరైనా డబ్బులకు ఆశపడి ఇలాంటి నేరాలకు పాల్పడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ, ఎస్సై హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ హాస్టల్ విద్యార్థులు ఇ.ప్రవళిక, జి.జలజలు రాష్ట్రస్థాయి సీనియర్ బెస్‌బాల్ పోటీలకు ఎంపికైన షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ షబానబేగం తెలిపారు. ఈ నెల 4న సుద్దాపల్లి పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన జిల్లా సీనియర్ బెస్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఈ నెల 7నుంచి 9వ తేదీ వరకు జగిత్యాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి బెస్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంతో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ బాలుర ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య జిల్లా వ్యాయమ సంఘం ప్రధానకార్యదర్శి బోజ్జ మహేష్ గౌడ్, సొప్పరి వినోద్, తదితరులు పాల్గొన్నారు,

రాష్ట్రస్థాయి పోటీలకు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎంపిక

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ పాఠశాల విద్యార్థిని కె.భానుశ్రీ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుప్పాల లక్ష్మీనర్సయ్య తెలిపారు. నవంబర్ 15న సుద్దాపల్లిలోని సాంఘీక సంక్షేమ పాఠశాలలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్ -17 విభాగంలో కె.భానుశ్రీ ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా విద్యార్థిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డైరెక్టర్ బోజ్జ మల్లేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ బాలికల జట్టు ఎంపిక

ముప్కాల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7నుంచి 10వరకు హైద రాబాద్ జరిగే 31వ ఇంటర్ డిస్టిక్ బాలికల కబడ్డీ జట్టు గురువారం ఎంపి క చేసినట్టు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కె.గంగాధర్ తెలి పారు. నాలుగు రోజుల నుంచి ఎంపిక చేసిన 20మంది క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ అందులో 12మంది క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా తరఫు న ఈనెల 7న పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు, క్రీడాకారులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఏర్గట్ల విద్యార్థిని ఎంపిక

ఏర్గట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని పురం షెట్టి నిఖిత రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి తెలిపారు. ఈ నెల 7 నుండి 10వ తేదిల్లో జరిగే హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు జ్యోతి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన విద్యార్థిని నిఖితను గురువారం పాఠశాల ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

ఫోకస్



● పునర్‌నిర్మాణ అనంతరం ఇలా మారనున్న స్టేషన్



కామారెడ్డి రైల్వేస్టేషన్‌కు ఆధునిక హంగులు

● యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్న పనులు ● అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద మెరుగులు ● రూ.39.84 కోట్ల వ్యయంతో పునర్‌నిర్మాణం

కామారెడ్డిటౌన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి రైల్వేస్టేషన్ కార్పొరేట్ స్థాయిలో ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటుంది. భారతరైల్వేమంత్రిత్వ శాఖ రైల్వే స్టేషన్‌లను ఆధునికరించడం, అభివృద్ధిచేయడమే లక్ష్యంగా పెట్టుకుని ఎప్పటికప్పుడు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ ప్రకారం వివిధ కీలక అంశాల అమలుపై ఆలోచనచేస్తుంది. ఇందులో భాగంగా రైల్వేలలో ప్రయాణించే వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే దృక్పథంతో భారీస్థాయిలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే స్టేషన్‌లకు నిధులు కేటాయించి రూపురేఖలు మారుస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా 40 రైల్వేస్టేషన్‌లను ఎంపిక చేయగా అందులో కామారెడ్డి రైల్వేస్టేషన్ సైతం ఉంది.

● 40 రైల్వేస్టేషన్ల ఎంపికలో కామారెడ్డి ఒకటి

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 40 రైల్వేస్టేషన్‌లను ఎంపికచేయగా అందులో కామారెడ్డి రైల్వేస్టేషన్ ఒకటి. 1896లో 629 కి.మి పొడవుతో హైదరాబాద్ నుండి మన్మాడ్ జంక్షన్ రైలుమార్గం ప్రారంభం చేశారు. ఇందులో కామారెడ్డి పట్టణకేంద్రంలో రైల్వేస్టేషన్ ఏర్పాటుచేసి ప్రయాణికులకు రైలుప్రయాణం అందుబాటులోకి తెచ్చారు.ప్రస్తుతం దక్షిణమధ్య రైల్వే ఆధ్వర్యంలో ఉండగా గతంలో నిజాం గ్యారెంటీడ్ స్టేట్ రైల్వే, గోదావరి వ్యాలీ రైల్వేలచే నిర్మించబడిన హైదరాబాద్- మన్మాడ్ రైల్వే లైన్ అని పిలువబడింది. సికింద్రాబాద్- మన్మాడ్ రైలు మార్గం ద్వారా కామారెడ్డి మీదుగా భారతదేశంలోని ప్రధాన నగరాల్లోని వివిధ ప్రాంతాలకు ప్రధాన వ్యవసాయ ఉత్పత్తులను, ప్రయాణికులకు రవాణాసేవలు కొనసాగుతున్నాయి.

● రూ.39.84 కోట్లతో పునరాభివృద్ధి

కామారెడ్డి రైల్వేస్టేషన్ హైదరాబాద్ డివిజన్ పరిధిలో నాన్ సబర్బన్ గ్రేడ్-4గా వర్గీకరించబడింది. సికింద్రాబాద్,నాగర్‌సోల్, ముంబై, నాందేడ్, తిరుపతి, బెంగళూర్ మొదలైన అనేక మార్గాలలో ప్రయాణించే సూపర్‌ఫాస్ట్ రైళ్లు కామారెడ్డిలో ఆగుతాయి. ఇలాంటి రైల్వేస్టేషన్‌కు ఆధునిక హంగులను కల్పించాలని అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సౌకర్యాల ప్రణాళికలను తయారుచేశారు. ఈ పథకం కింద రూ.39.84 కోట్లతో రైల్వేపునర్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. సుమారు 360చ.మీ విస్తీర్ణంతో స్టేషన్‌భవన పునారాభివృద్ధి జరుగుతుంది. 2450చ.మీ. స్టేషన్‌ప్రాంగణం అభివృద్ధి చేయనున్నారు.

● రైల్వేస్టేషన్‌లో చేపట్టనున్న పనులు

కామారెడ్డి రైల్వే స్టేషన్ మొదటి ప్రవేశ ద్వారం సౌకర్యాల అభివృద్ధి,రెండో ప్రవేశ ఏర్పాటు,ఉన్న షెడ్‌ను బుకింగ్ కార్యాలయంగా మార్చడం,మొదటి ప్రవేశంలో ఉన్న జీఆర్‌పీ కార్యాలయాన్నికూల్చివేయడం పూర్తికాగా,ట్రాక్ మెషిన్ విశ్రాంతి గదిని జీఆర్‌పీ కార్యాలయంగా మారుస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం 3 లిఫ్టులు, 2 ఎస్కలేటర్ల ఏర్పాటుతో పాటు 12 మీటర్ల వెడల్పుగల పాదచారుల వంతెన నిర్మాణం, ప్లాట్‌ఫారమ్‌కు మెరుగులు, అదనపు కప్పు ఏర్పాటు,దివ్యాంగులకు సౌకర్యాలతో పాటు టాయిలెట్ల నిర్మాణం, ప్రయాణికులకు అనుకులంగా కోచ్‌లను తెలిపే, రైళ్ల రాకపోకలను తెలియజేస్తే సూచికబోర్డులు ఏర్పాటుచేయనున్నారు. మరో మూడు నెలలో కామారెడ్డి రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయి.







గతంలో కామారెడ్డి రైల్వే స్టేషన్ ఉన్నదిలా..



యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్న పనులు

పోస్టింగ్ ఒకచోట.. విధులు మరోచోట!



విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం (ఫైల్)

● విద్యుత్ శాఖలో వింత ధోరణి

సుభాష్‌నగర్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్‌డివిజన్ పరిధిలో వింత ధోరణి సాగుతోంది. పోస్టింగ్ ఒకచోట అయినా విధులు మరోచోట చేస్తున్నా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల సాధారణ బదిలీల్లో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా బదిలీలు నిర్వహించారు. ఒకటి రెండు చోట్ల బదిలీల్లో అవకతవకలు జరిగిన మళ్లీ సరిదిద్దుకున్నారు. ఇదంతా ఇలా ఉంటే నిజామాబాద్ డివిజన్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ఉద్యోగి ఇటీవల నిజామాబాద్‌టౌన్-1 ఈఆర్‌వో సెక్షన్‌కు బదిలీ అయ్యింది. బదిలీ అయ్యి నెలలు గడుస్తున్నా నిజామాబాద్ డివిజన్‌లోనే విధులు నిర్వహిస్తోంది. అసలు ఉద్యోగం అటెండర్ అయిన అటెండర్ ఉద్యోగం చేయకుండా జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగం చేస్తుందని పవర్‌హౌజ్ కంపౌండ్ కార్యాలయంలో గుసగుసలు విన్పిస్తున్నాయి. తన కోసం ఒక ప్రత్యేక టేబుల్‌ను ఏర్పాటుచేసుకొని విధులు నిర్వహిస్తోందని తోటి ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు. ఈమహిళా ఉద్యోగికి ఉన్నతాధికారులు అండగా ఉండటంతో మహిళా ఉద్యోగుల చేతలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అటెండర్ ఉద్యోగం చేయకుండా ఆఫీసర్ ఉద్యోగం చేస్తూ తాను జూనియర్ అసిస్టెంట్ అని చెబుతున్నట్లు బయట ప్రచారం జరుగుతోంది. పోస్టింగ్ ఇచ్చి నెల గడుస్తున్నా అక్కడ ఒక్క రోజు కూడా విధులు నిర్వహించకుండా మధ్యాహ్న సమయంలో బదిలీ అయిన స్థానంలో సంతకాలు చేస్తోంది. ఇదంతా రోజూ జరుగుతున్నా ఉన్నత అధికారులు మాత్రం ఇటు వైపు దృష్టి సారించడం లేదు. అటెండర్ ఉద్యోగం చేయకుండా ఇక్కడ ఉన్న అధికారులు ఆమెకు ప్రమోషన్ ఇచ్చి ఉద్యోగం చేయించడం పట్ల తోటి ఉద్యోగులు మండిపడుతున్నారు. ఉద్యోగి ఎక్కడ విధులు నిర్వహిస్తోందని ఈఆర్‌వో అధికారిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తమ వద్దే విధులు నిర్వహిస్తోందని చెప్పడం కొసమెరుపు. దీనిపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాముడి భూములు

50 ఎకరాలు అన్యాక్రాంతం!

● కబ్జాదారుల కబంద హస్తాల్లో ఆలయ భూములు ● పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు





ఇందల్వాయి రామాలయం, ప్రక్కన ఏకశీల రాముడి విగ్రహం

డిచ్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి రామాలయానికి చెందిన సుమారు 50 ఎకరాల దేవాలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. అయినా నా ఇటు పాలకులు గానీ, దేవాదాయ అధికారులు గానీ కనీసం పట్టించుకోవడం లేదు. రూ. కోట్ల విలువల గల భూములు కబ్జాదారుల కబంధ హస్తల్లో చిక్కుకున్నాయి. ఈ భూములు డిచ్‌పల్లి మండలంలోని సుద్దులం, కోరట్‌పల్లి, గ్రామాల్లో ఉండటంతో ఆ భూములను తమ ఆధనంలోకి తెచ్చుకునేందుకు గత కొన్నేళ్లుగా సాగులో ఉన్న రైతులు అధికారులపై ప్రజా ప్రతినిధులతో ఒత్తిళ్ల తీసుకొచ్చి పట్టాలు చేసుకునేందుకు విశ్వప్రయ త్నాలు చేస్తున్నారు. 50 ఎకరాల దేవాలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆలయ భూములను రైతులు స్వచ్ఛందంగా సాగు చేస్తున్నారు. గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు భూముల తాలూకు లేఖలు ఇవ్వడం తప్ప ఆ భూములపై సరైన స్పందన కరవవడంతో కబ్జాదారులు భూముల తాలూకు పట్టాలు చేసుకునేందుకు గత ప్రభుత్వ హయాం నుంచే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏకశీల రాముడి విగ్రహం గల ఇందల్వాయి రామాల యంలో గతంలో వజ్రాలు, ఏనుగులు, విక్రయించేవారని చరిత్ర చెబుతోంది. ఆలయ భూములు కాపాడాల్సిన అధికారులే కబ్జాదారులకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఆలయ భూములను కాపాడాల్సిన బాధ్యత దేవదాయ శాఖ, రెవెన్యూ అధికారులు గ్రామస్థులపై ఎంతైనా ఉంది ఈ విషయమై తహసీల్దార్ ప్రభాకర్‌ను సంప్రదించగా కోరట్‌పల్లి, సుద్దులం శివారులోని రామాలయం భూములు అన్యాక్రాంతం గాకుండా చర్యలు తీసుకుంటామని ఈ విషయంలో దేవాదయ శాఖకు లేఖ రాస్తామని పేర్కొన్నారు.



● రామాలయ పరిధిలోని భూములు





అధ్వానంగా తయారైన రోడ్డు


గ్రామీణ రోడ్లకు మోక్షమెప్పుడు?

● రూ.45 లక్షలు నిధులు మంజూరైనా మొదలు కాని పనులు ● దూరభారంతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

ముప్కాల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామం నుంచి బాల్కొండ మండలం వన్నెల్ (బీ) గ్రామం వరకు నిర్మించే బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడు వస్తుందోనని పలువురు గ్రామస్థులు ఎదురుచూస్తున్నారు. గ్రామాల్లో రహదారుల సుందరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసినప్పటికీ గ్రామరహదారుల నిర్మాణాలు చేపట్టడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలం చెందారు. గత సంవత్సరం నిధులు మంజూరైన పనులు ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో నిత్యం ఈ రహదారి వెంట వెళ్లే వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే కొత్తపల్లి నుంచి వన్నెల్(బీ) దూరభారం తగ్గుతుంది. ఇక్కడి నుంచి రెంజర్ల, దర్మోరా, శెట్‌పల్లి, వెంచిర్యాల్ వెళ్లే గ్రామాలకు దూరభారం తగ్గి సౌకర్యంగా ఉందనుకున్న ప్రయాణికులకు ఇప్పటివరకు పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. ఏడాది క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.45 లక్షల వ్యయంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంజూరు చేసి టెండర్ కూడా పూర్తి చేశారు. వన్నెల్(బీ) నుంచి వేంపల్లిరోడ్డు వరకు ఈ మధ్యే బీటీ రోడ్డు వరకు పూర్తిచేశారు. కానీ వేంపల్లిరోడ్డు నుంచి కొత్తపల్లిరోడ్డు పనులు మాత్రం మొదలుపెట్టలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా గుంతలమయం అయ్యాయి. దీంతో అటు వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు పడరానిపట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి పనులను ప్రారంభించాలని గ్రామస్థులు, ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి

● రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ, కొత్తపల్లి



గత కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధుల చుట్టూ తి రుగుతున్నా రోడ్డు పనులు చేపట్టడం లేదు. గత ప్రభుత్వ హయాంలో కొత్తపల్లి నుంచి వన్నెల్ వరకు రోడ్డు మంజూరైనప్పటికీ వన్నెల్ నుంచి వేంపల్లి వరకు బీటీ రోడ్డు పనులు పూర్తయినా, వేంపల్లి, కొత్తపల్లి వరకు పనులు ఇంకా మొద లు పెట్టడంలేదు. ప్రజాప్రతినిధులు, అధికారు లు చొరవచూపి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



పెద్దకొడప్‌గల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో సంస్థాగతంగా ఆన్‌లైన్ ద్వారా యూత్ కాంగ్రెస్ ఎన్నికలు జరగగా మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ ఎన్నికయ్యారు. దీంతో నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని బుధవారం రాత్రి జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావ్‌ను కలువగా ఎమ్మెల్యే నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

చావుని తండాలో పశువైద్య శిబిరం

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చావుని తాండాలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు మణికుమార్ మాట్లాడుతు లింగ నిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ జరిపించే ప్రక్రియ గురించి వివరించారు. జిల్లా పశువైద్యాధికారి సహాయంతో అల్ట్రా స్కానింగ్ తెప్పించి 41 గేదెలకు గర్భకోశ, 11 పశువులకు సాధారణ, 27 దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు మహేష్, జైపాల్ సింగ్, గోపాల మిత్ర బస్వరాజ్, గోపాలమిత్రలు గంగరాం, రవీందర్, రాజిరెడ్డి, గౌసోద్దీన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా టాడా అధ్యక్షుడిగా కిషన్



జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్‌ను సన్మానిస్తున్న టాడా సభ్యులు

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా టాడా (తెలంగాణా అగ్రి డాక్టర్స్ అసోసియేషన్) ఎన్నికలు బుధవారం రాత్రి కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ ఎన్నికలు రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరుగగా పెద్ద కొడప్‌గల్ మండల ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న కిషన్‌ను టాడా అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి టాడా అధ్యక్షులుగా ఎన్నుకున్న వారికి రుణపడి ఉంటానని, టాడాల సమస్యలపై పోరాటం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన టాడా కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ నాయుడును సన్మానించారు. ఈ కార్యక్రమంలో టాడా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, ఛైర్మన్ శ్రీనివాస్ రావ్, వైస్ ఛైర్మన్ రాజు, పబ్లిసిటీ అధ్యక్షురాలు మహేశ్వరి, కోశాధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



పిట్లంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

పిట్లం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డ్‌లో గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేటు ఆసుపత్రిలలో చికిత్స చెయించుకున్న లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా ఆర్థికసాయం కింద అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎయంసి వైస్ ఛైర్మెన్ కృష్ణారెడ్డి, విండో వైస్ ఛైర్మెన్ వెంకట్‌రెడ్డి, నాయకులు మొహన్‌రెడ్డి, బోడ్ల రాజు, మొయిన్, పద్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పిట్లం డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకునె విద్యార్థులకు నాన్యతతో కూడిన భోజనం అందిచాలని, నిర్లక్షం వహిస్తె చర్యలు తప్పవని తహశీల్దార్ వేణుగోపాల్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో భోజన వసతులపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ వంటశాలలో తప్పని సరిగా శుభ్రంగా ఉండాలని, ప్రతీ రోజు మెనూ ప్రకారం విద్యార్థులకు చక్కని భోజనం అందించాలని మధ్యాహ్న నిర్వహకులకు సూచించారు. పాఠశాలలో ప రిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండాలని ప్రదానోపాధ్యాయులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కమలాకర్ ఉన్నారు.

దోమకొండలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

దోమకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని సంగమేశ్వర్ చౌరస్తా వద్ద గురువారం ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బైక్‌లను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నటువంటి వాహనదారులకు జరిమాన విధించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విరాళం అందజేత

కామారెడ్డిటౌన్,డిసెంబరు 5: కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ఒక లక్ష రూపాయలను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి అందించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి తనవంతు సహాయసహకరాలు మరింత ఉంటాయన్నారు.

తాడ్వాయి మండల అభివృద్ధే నా లక్ష్యం

● నీటి సమస్య పరిష్కారం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే..

● 'ఆంధ్రజ్యోతి'తో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

తాడ్వాయి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే నా లక్ష్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. ఈ సందర్భంగా మండలంలో చేసిన పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి మండలంలో తొమ్మిది బోర్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో తాడ్వాయి టౌన్ చిట్యాల నందివాడ, పెర్మాయికుంట తండా, దేవాయిపల్లి, సంగోజీవాడి, బ్రహ్మాజీవాడి గ్రామాల్లో బోర్లను మంజూరు చేశారు. 1.75 కోట్ల నిధులతో చిట్యాల కొత్త సబ్ స్టేషన్ మంజూరు చేసి పలు గ్రామా లకు కరెంట్ కొరత తీర్చిన ఘనత తమకే దక్కుతుందని అన్నారు. 3.5 కోట్ల నిధులతో సోమవారం నుంచి బసనపల్లి వరకు రోడ్డు మంజూరు చేశామని తెలిపారు. 65 లక్షలతో తాడ్వాయి, చిట్యాల, సంతాయిపేట, ఎర్రపాడు కన్కల్, బ్రాహ్మణపల్లి, నందివాడ గ్రామాలకు ఎంజీ ఎన్ఆర్ ఈజీఎస్ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టారని అన్నారు. ఎర్రపాడు గ్రామంలో జడ్పీహెచ్ఎస్ బాలుర బాలికల అభివృద్ధికి 11 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. టేక్రియాల్ నుంచి బ్రాహ్మణపల్లి వరకు మధ్యలో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. కేవలం డాంబర్ రోడ్డు మాత్రమే మిగిలి ఉందని అన్నారు. దీనిని త్వరలో పూర్తి చేస్తామన్నారు. తాడ్వాయిలో మినీ స్టేడియానికి ఆమోదం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామని తెలిపారు. మండలంలో మొత్తం 45.05 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ప్రజలకు అవసరమైన ఎల్‌వోసీ చెక్కులను 1.5 కోట్లు ఇప్పించినట్లు కళ్యాణ లక్ష్మీ చెక్కులను ఒక కోటి ఆరు లక్షల 12 వేల 296 రూపాయల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి 12 లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు తెలిపారు. దేమికలాన్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి 20 లక్షల నిధులు మంజూరు కోసం పంపినట్లు తెలిపారు. కృష్ణాజివాడి గ్రామంలో జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం రెండు లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. దేవాయిపల్లి, కృష్ణాజివాడి, చందాపూర్, బ్రాహ్మణపల్లి, నందివాడ తదితర గ్రామాలకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం 60 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పలు అభివృద్ధి సంక్షేమ పథకాల కోసం ఆమోదానికి పంపిన మంజూరు చేసిన అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఒక సంవత్సర కాలంలో ఎక్కడ లేని అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాబోవు రోజుల్లో పల్లెలు, పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తానన్నారు.

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే



మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన ఎమ్మెల్యే

సదాశివనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు,సీనియర్ నాయుడు బంబోతుల లింగగౌడ్, సదాశివనగర్ మండల మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం మంత్రి పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాలుఅందించారు. ఎల్లారెడ్డిని యోజకవర్గంలో ఆసుపత్రుల అభివృద్ధికి తోడ్పడాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేవిధంగా ప్రభుత్వానుపత్రులను మరింత తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కృషిచేయాలని కోరామన్నారు.

నిరవధిక సమ్మెకు సిద్ధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు

తాడ్వాయి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు అందరూ ఒక రోజు నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం కస్తూర్బా గాంధీ పాఠశాలలో భోజన విరామ సమయంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేయాలని అప్పటి వరకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారని పూర్తి విశ్వాసం వ్యక్తంచేశారు. ఈనెలలో 6, 7వ తేదిల్లో జిల్లా కేంద్రం రెండు రోజుల నిరసన దీక్షలు చేపడుతున్నామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే 9వ తేదీ నుంచి నిరవధిక సమ్మె ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి కేజీబీవీ ప్రిన్సిపాల్ రాణి, ఎంఐఎస్ మౌనిక, సీవో మంజు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

తాడ్వాయి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఖచ్చితంగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నర్సింలు అఅన్నరు. ఈయన గురువారం మండలంలోని ఎర్రపహాడ్ రైతు వేదికలో ప్రపంచ మృతిక దినోత్సవం పురస్కరించుకుని రైతులతో మాట్లాడారు. అనంతరం తాడ్వాయిలోని అన్ని రైతు వేదికలలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఇందులో మండల వ్యవసాయ అధికారి నర్సింలు, తాడ్వాయి రైతు వేదికలో, ఎర్రపాడు రైతు వేదికలో పాల్గొన్నారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ నేలలు పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. నేలను కాపాడుకునే వివిధ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సతీష్, రైతులు సూర్యకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, సంజీవ్, బాల్‌రెడ్డి, గఫూర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేద్రంలోని రైతు వేదికలో గురువారం ఏవో మణిదీపిక భూసార పరీక్షపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రపంచ మృత్తిక (నేలల) దినోత్సవం సందర్భంగా భూసార పరీక్షపై రైతులకు అవగాహన కల్పించారు. నేల ఆరోగ్యం, సారం కాపాడుకోవడం కోసం తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు క్రిష్ణారెడ్డి, మానృ్యష, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన రేషన్ సరఫరా చేయాలి

ఎల్లారెడ్డి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత ఆగస్టు నెలలో పెద్దపల్లి జగిత్యాల జిల్లాల నుంచి వచ్చిన నాణ్యత లేని రంగు మారిన బియ్యం ఎల్లారెడ్డి ఎంఎల్ఎస్ పాయింట్ నుండి మండలంలోని వివిధ రేషన్ దుకాణాలకు సరఫరా చేయడంతో వినియోగదారుల ఫిర్యాదు మేరకు వివిధ దినపత్రికలో వచ్చిన వార్తలకు స్పందించిన అధికారులు పౌర సరఫరాల డీఎం ఎఫ్‌సీఐ టీఎలు, ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బియ్యాన్ని పరిశీలించి నాణ్యతలేవని పెద్దపల్లి, జగిత్యాల నుంచి వచ్చిన బియ్యం తిరిగి అక్కడికి పంపించాలని అధికారులు తెలిపిన స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి రంగు మారిన ముక్కిన బియ్యాన్ని రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారని దీంతో వినియోగదారులు లబ్దిదారులు ప్రశ్నించడంతో గురువారం ఎల్లారెడ్డి రేషన్ డీలర్లు గురువారం కామారెడ్డి సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేశారు.

కోతుల బెడదను తీర్చండి

భిక్కనూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఫారెస్ట్ అధికారులు వెంటనే కోతుల బెడదను నివారించాలని సమాచార హక్కు చట్టం జిల్లా ప్రతినిధి గంగుల రవీందర్ కోరారు. గురువారం కామారెడ్డి అటవీ శాఖ కార్యాలయంలో అటవీశాఖ అధికారులకు కోతుల బెడదపై వినతి పత్రాన్ని అందజేశారు.

7నుంచి సీఎం కప్ క్రీడలు

లింగంపేట, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం కప్-2024 క్రీడలు ఈ నెల 7 నుంచి గ్రామస్థాయిలో జరుగతాయని క్రీడా కారులు నేటి నుంచి అయా గ్రామాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. ఆయన గురువారం లింగంపేట రైతువేదికలో నిర్వహించిన పంచాయితీ కార్యదర్శులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయిలో ఈనెల 7,8 తేదీల్లో క్రీడలు నిర్వహించుకుని ఎంపిక చేసిన క్రీడాకారులను మండల స్థాయిలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే క్రీడలకు హజరుపర్చాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరెందర్, ఎంపీవో మలహరి, ఎంఈవో శౌకత్ అలీలతో పాటు వివిధ గ్రామాల కార్యదర్శులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

దోమకొండ (బీబీపేట): సీఎం కప్ పోటీలకు బీబీపేట మండలంలో అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులు స్వీకరించాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ అన్నారు. గురువారం బీబీపేట మండల పరిషత్ కార్యాలయంలో అన్ని జీపీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. క్రీడాకారుల నుంచి వారు పాల్గొనే ఆటలకు సంబంధించి దరఖాస్తులను సేకరించాలన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

నాగిరెడ్డిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం పరిశీలించనున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. మండలంలోని ఆత్మకూర్, మాటూర్, మాసానిపల్లి, జలాల్‌పూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మల్లికార్జున్ ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుపై డీఎల్పీవో విచారణ

నాగిరెడ్డిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుపై గురువారం విచారణ జరిపినట్లు ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్ తెలిపారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామ పంచాయితీ పరిధిలో గల సర్వే నెంబర్ 506, 507 లోని వెంచర్ ప్లాట్‌లలో ఎల్ఆర్ఎస్ చేయవద్దని గ్రామానికి చెందిన బోయిని రాజశేఖర్ ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు డీఎల్‌పీవో సురేందర్ తెలిపారు. దీంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు విచారణ జరిపినట్లు నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు ఆయన తెలిపారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

మద్నూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని మద్నూర్ ఎస్సై విజయకొండ అవగాహన కల్పించారు. గురువారం ఆటో డ్రైవర్లను మద్నూర్ పోలీస్‌స్టేషన్ పిలిపించి అవగాహన కల్పించారు. ఆటోలకు సంబంధించిన అన్ని పేపర్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్‌తో పాటు డ్రెస్ కోడ్ పాటించాలని ప్రయాణీకులను పరిమితికి మించి ఎక్కించుకోకూడదని పలు విషయాలపై వాళ్లకు తెలియజేయడం జరిగింది. మద్నూర్ బస్టాండ్‌లో నిలిపే ఆటోలు ఇబ్బడ ముబ్బడిగా నిలపకుండా రోడ్డుపై నిలబెట్టకుండా వరుస క్రమంలో క్యూ లైన్‌లో నిలబెట్టుకోవాలని సూచించామన్నారు. మద్యం తాగి ఆటోలు నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

మిషన్ భగీరథ నీటినే తాగాలి

ఎల్లారెడ్డి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీటినే తాగాలని ఎల్లారెడ్డి ఏఈ వినోద్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మండలంలోని అన్నసాగర్, వెల్లుట్ల గ్రామాలలో ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్వో నీటి కంటే మిషన్ భగీరథ నీరు ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు గ్రామాలలో సింగిల్ ఫేస్ మోటార్స్ హ్యాండ్ పంపుచుట్టూ గ్రామపంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు ఎల్లారెడ్డి మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీలోని ఆవాస ప్రాంతంలో ఉన్న 84 ట్యాంకులు శుభ్రపరిచి మిషన్ భగీరథ త్రాగునీరు ఉపయోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

భారత రాజ్యాంగ ఉత్సవాలు

దోమకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కుల, సంగమేశ్వర్ గ్రామాల్లో గురువారం భారత రాజ్యాంగ ఉత్సవాలను నిర్వహించినట్లు దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకులు తలారి ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 26న రాజ్యాంగ ప్రచార ఉద్యమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుమలత, మురళి, సత్యం, నరేష్, నత్తి రమేష్, కొత్తెల్ల శంకర్, బాలయ్య, రాజయ్య, పోచయ్య, రాజయ్య, శంకర్, నర్సింలు, సంజీవ్, గణేష్ పాల్గొన్నారు.



ఉచిత బస్సు ప్రయాణ టికెట్‌ను ప్రయాణికులకు అందిస్తున్న చైర్‌పర్సన్

మహిళలకు అండగా కాంగ్రెస్ పథకాలు

కామారెడ్డిటౌన్, డిసెంబరు 5: మహిళలకు కాంగ్రెస్ పథకాలు అండగా నిలుస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మహాలక్ష్మీ పథకంలో భాగంగా అమలు అవుతున్న ఉచిత బస్సు ప్రయాణాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకంతో రోజుకు రూ.45.49 లక్షల నుంచి రూ.58.13 లక్షలకు మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీపో మేనేజర్ ఇందిరా, డిప్యూటి ఆర్ఎం శంకర్, సమీర్,లింగం,కండక్టర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా

మద్నూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని మద్నూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షు డిగా ఎంపికైన హనుమంతు యాదవ్ అన్నారు. మూడు నెలల క్రితం ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నిక ఫలితాలు వెళ్లడయ్యాయి. ఉమ్మడి మద్నూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా హనుమంతు యాదవ్ ఎన్నికైనట్లు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలవడానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐని బలోపేతం చేస్తూ యువత రాజకీయాల్లో ప్రోత్సహించే విధంగా కృషి చేస్తానన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి



బాన్సువాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. యువజన కాంగ్రెస్ గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఎన్నికల్లో కామారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా బాన్సువాడ మండలం తడ్కోల్ గ్రామానికి చెందిన మధు సూదన్ రెడ్డికి 12322 ఓట్లు పొందారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలో పేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనను బలపర్చిన నియోజకవర్గ అధ్యక్షులుగా జుక్కల్, బాన్సువాడ, కామారెడ్డి అధ్యక్షుడు ఇమ్రోస్, మన్సూర్, గుడుగుల శ్రీనివాస్ గెలుపొందారు.

వరి కొయ్యలను కాల్చకుండా కలియ దున్నాలి

● జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్

లింగంపేట, డిసెంబరు, 5: (ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంటలు పూర్తి కాగానే వరి కొయ్యలను కాల్చకుండా కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. ఆయన గురువారం ప్రపంచ మృతిక దినోత్సవం సందర్భంగా రైతులకు పంట పొలాల్లో మట్టి నమునాలు చేపడితే అధిక దిగుబడులు వస్తాయని మట్టి నమునాపై రైతులకు అవగాహన కల్పించారు. పంట పొలాల్లో నమునాకు తీసుకెళ్లే మట్టిని సేకరించే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్, ఏఈ వోలు మధుసూదన్, అమీర్, సంతోష్‌కుమార్, రాకేష్, నవ్య రైతులకు అవ గాహన కల్పించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కామారెడ్డిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని కేపీఆర్‌కాలనీకి చెందిన కొండా పవన్‌కుమార్ (42) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రెండేళ్ల కింద రామారెడ్డి మండలం రెడ్డిపేట నుంచి పవన్‌కామారెడ్డికి వచ్చి ఒక ఇల్లు కొని, దానికి బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాడని, తెలిసిన వారి వద్ద సైతం అప్పు చేసి ఆ తిరిగి చెల్లించలేకపోవడం, పనిసైతం లభించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై పవన్‌భార్య లావణ్య రెడ్డిపేటకు డ్వాక్రాగ్రూప్‌లో డబ్బులు కట్టడానికి వెళ్లగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి భార్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఫార్మాసిస్ట్ ఆత్మహత్య




శిరీష (ఫైల్)

కామారెడ్డిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని భూపుత్రమ్మ కల్యాణ మండపంలో నివాసం ఉండే ఫార్మాసిస్ట్ శిరిష (29) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యచేసుకున్నట్లు పట్టణ సీఐచంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.కామారెడ్డి బీడీ వర్కర్స్‌కాలనీలో నివాసం ఉండే వంగరి బాలయ్య కూతురైన శిరీష గత ఎనిమిది సంవత్సరాల కిందట స్వామి అనే వ్యక్తిని ప్రేమవివాహం చేసుకోగా వారికి ఇద్దరు సంతానం కలిగారన్నారు. ప్రస్తుతం భూ పుత్రమ్మ కల్యాణ మండపంలో ఉన్న చిన్నరూమ్‌లో నివాసం ఉంటున్నారని తెలిపారు. మృతురాలి భర్త స్వామి ఆర్థిక పరిస్థితి బాగాలేక సౌదీ అరేబియాకు వెళ్లాడని తెలిపారు. శిరీష కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేనందున జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి తండ్రి బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా బిచ్కుంద మండలంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపాదికన శిరిష పనిచేస్తుందని కొద్దిరోజులుగా కొందరు వ్యక్తులు ఆమె ఉద్యోగం విషయంలో వేధించడంతో పాటు ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో తీవ్ర మనోవేదనకు గురైందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో మరో చర్చ జరగడం గమనార్హం.

ఏడాది కాలంలో హామీలను నెరవేర్చని కాంగ్రెస్


● బాన్సువాడ బీజేపీ సీనియర్ నాయకులు కోణాల గంగారెడ్డి



బాన్సువాడలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని చెప్పినప్పటికీ ఏడాది దాటిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ప్రజలను మోసం చేసిందని బిజెపి సీనియర్ నాయకులు కోణాల గంగారెడ్డి ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం బాన్సువాడ బీజేపీ కార్యాలయం నుంచి ప్రధాన వీదుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించి స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో బీజేపీ నాయకులు కోనాల గంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నప్పటికీ 2023 అసెంబ్లీ ఎన్నికల వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు పాటు 66 వాగ్దానాలు ఐదేళ్లలో మేనిఫెస్టోలో ఉన్న అన్ని నెరవేర్చమని ప్రజలను మభ్యపెట్టి ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ఏడాది పాలనలో ఒక్క గ్యారెంటీని పూర్తి స్థాయిలో అమలు చేయక ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు తృష్టి ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి హనుమాన్లు, బీర్కూరు మండల అధ్యక్షుడు సాయి కిరణ్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

